


## అమెరికన్ సామ్రాజ్యవాదం అంతర్జాతీయ టెర్రరిస్టుగా మారింది

బి.వి.రాఘవులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అమెరికన్ సామ్రాజ్యవాదం అంతర్జాతీయ టెర్రరిస్టుగా రూపాంతరం చెందిందని సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు పేర్కొన్నారు. 'ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడికి నిరసనగా సోమవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ అమెరికా ప్రపంచ దేశాలపై అడ్డగోలుగా దాడులు తెగబడుతూ ఆ దేశాల నాయకత్వాన్ని ప్రజలను చంపి, ఆర్థిక వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే తాజాగా ఇరాన్‌పై దాడికి తెగబడిందన్నారు. ఇరాన్‌నుమాత్రమే కాదని, ప్రపంచంలో అనేక దేశాలను ఆమెరికా బెదిరిస్తున్నదని చెప్పారు. విశ్వగురువునంటూ మీసాలు మెలేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా తొత్తుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి, ఎస్ వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జి.నాగయ్య టి.సాగర్, ఎం.డి.అబ్బాస్, బండారు రవికుమార్, మల్లు లక్ష్మి, చుక్క రాములు, పోతినేని సుదర్శన్, ఎండీ జాహింగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.వి.రమ, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు బిజెపి కుట్రలు




సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పలు రాష్ట్రాల్లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు బిజెపి కుట్రలు పన్నుతోందని సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్ కుమార్ ఆరోపించారు. ఇందుకు మత వైషమ్యాలను రెచ్చగొట్టేందుకు యత్నిస్తోందన్నారు. సిపిఐ (ఎం)కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అధ్యక్షవర్గంగా సిపిఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశం సోమవారం హైదరాబాద్ లోనిసుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి అరుణ్ కుమార్ మాట్లాడుతూ అమెరికా ఫస్ట్ అని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బహిరంగ ప్రకటిస్తుండగా, ఇండియా ఫస్ట్‌అని మన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎందుకు చెప్పడం లేదని ఆయన ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోవడానికి మోదీ సాగిల పడుతున్నారని విమర్శించారు. ముస్లింలపై నరసరానద్వేషంతో ఉన్న ట్రంప్, మోదీ, నెతన్యాహు ముగ్గురిలోనూ సైద్ధాంతిక సారూప్యత ఉందని పేర్కొన్నారు. బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 24న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ 6 గ్యారంటీలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత తప్పదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, గ్లోబల్ సమ్మిట్, దావోస్ పర్యటనలు చేసినా పెట్టుబడులు రాలేదని, ప్రచారార్భాటం తప్ప చేసింది ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య, జూలకంటి రంగారెడ్డి, పాలడుగు భాస్కర్, టి సాగర్, మల్లు లక్ష్మి, పి.ప్రభాకర్, బండారు రవికుమార్, సున్నా నాగేశ్వరరావు, ఎండి జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## దర్గా తరలింపుపై పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని దర్గా తరలింపు ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంలో వివరణ ఇవ్వాలని రాష్ట్రానికి హైకోర్టు నోటీసులు ఇచ్చింది. పూర్తి వివరాలు అందజేయాలని రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, వక్ఫ్ బోర్డు సీఈవో, జిల్లా ఎస్పీ, వేములవాడ ఆలయ ఈవోలను ఆదేశించింది. వేములవాడలోని దర్గా తరలింపు చర్యలను సవాలు చేస్తూ నజీమా వేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారించారు. వేములవాడలో రాజరాజేశ్వరి ఆలయం చాలా ప్రసిద్ధి చెందినదని, భక్తుల తాకిడి పెరుగుతున్నందున వాళ్లకు వసతుల కల్పన కోసం ప్రార్థనా మందిరాన్ని మరోక చోట వసతులున్న చోట కేటాయింపు జరిగిందన్నారు. ఇదేమీ వేరే మతానికి వ్యతిరేకం కానేకాదన్నారు. ప్రజాభిప్రాయం మేరకే దర్గా తరలింపు జరుగుతోందన్నారు. ప్రభుత్వవివరణ కోసం విచారణ ఈనెల 16కి వాయిదా పడింది.



# 99రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక

కలెక్టర్లకు సిఎస్ దిశానిర్దేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి నిర్వహించనున్న 'జిల్లా కలెక్టర్ల' సమావేశానికి అన్ని శాఖల వారిగా సమగ్రమైన ప్రజంటేషన్లతో సిద్ధంగ రావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ఆదేశించారు. '99రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక' కార్యక్రమం నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం ఉదయం 9: 30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 'జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్' నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు దిశానిర్ధేశం చేయనున్నారు. ఈ సమావేశ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు సచివాలయంలో సోమవారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్చించాల్సిన అంశాలపై ప్రతి శాఖ సమగ్ర ప్రెజెంటేషన్లు సిద్ధం చేయాలని, లక్ష్యాలను, గడువులను, కార్యక్రమాల పర్యవేక్షణ తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ల సమావేశంలో ఉదయం 'జనగణన' (సెన్సెస్) ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించనున్నారు. జిల్లా స్థాయిలో ఖచ్చితత్వం, పారదర్శకతతో గడువులోపల లెక్కింపును పూర్తి చేయడానికి అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేపట్టాలని రామకృష్ణ రావు సూచించారు. గ్రామ, మండల స్థాయిలో సిబ్బందికి తగిన శిక్షణ, పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం చేయాలన్నారు. మధ్యాహ్నం జరిగే సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ '99 రోజుల కార్యాచరణ ప్రణాళిక'పై సమగ్ర సమీక్ష చేపట్టనున్నారు. అభివృద్ధి పనులు వేగవంతం, భూసేకరణ ప్రక్రియను సులభతరం, అటవీ అనుమతులను సమయానికి పొందడం వంటి పలు అంశాలపై దృష్టి సారించనున్నానని, జిల్లాల వారీగా పురోగతిని పరిశీలించి, అడ్డంకులను తొలగించేందుకు తీసుకునే చర్యలను సమావేశంలో సూచించనున్నారని రామకృష్ణరావు తెలిపారు. ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు అమలు చేయనున్న 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంపై సమావేశంలో చర్చిస్తారని, గ్రామీణ స్థాయిలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు అభివృద్ధి పథకాల అమలు వేగవంతం చేయడం,తదితర అంశాలు ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలుగా ఆయన వివరించారు. జిల్లాల్లో ఈ కార్యక్రమాల అమలులో కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలని ఆదేశించారు.ఈ సమావేశానికి డిజిపి శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, వికాస్ రాజ్, ప్రధాన కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, కార్యదర్శులు లోకేశ్ కుమార్, క్రిస్టియానా జెడ్ చోంగ్తు, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ సి.హెచ్ ప్రియాంక తదితర శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## 'ఎస్‌సి రిజర్వేషన్ల పెంపు' అంశంపైన అసెంబ్లీలో తీర్మానం చేయాలి : కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వ జనాభా లెక్కలకు అనుగుణంగా ఎస్‌సి రిజర్వేషన్లు పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, దీనికి అనుగుణంగానే ఎస్‌సి రిజర్వేషన్ల పెంపునకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఎస్‌సిలలో ఉప కులాలకు విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయాల్లోనూ రిజర్వేషన్ ఫలాలు దక్కాలని కోరారు. హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఎస్‌సి ఉప కులాల నాయకులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఎస్‌సి ఉప కులాలకు రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పెరిగిన ఎస్‌సి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్‌సిల జనాభా 15 శాతం నుంచి 18 శాతానికి పెరిగిన విషయం గతంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే, ఇటీవల ప్రస్తుత ప్రభుత్వం నిర్వహించిన 'సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణన'లో స్పష్టమైందని వివరించారు. ఎస్‌సి ఉప కులాల్లో కొన్ని కులాలకు కుల ధ్రువీకరణ పత్రాల జారీ అంశంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో 20 ఎస్‌సి ఉప కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేంద్రీకృత టెండర్ల విధానం అమలు చేనేతల పొట్ట కొట్టడమే

వెంకట్రాములు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం కేంద్రీకృత టెండర్ల విధానం అమలు చేయడమంటే చేనేతల పొట్ట కొట్టడమేనని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకట్రాములు అన్నారు. ఈ టెండర్ విధానాన్ని తక్షణమే రద్దుచేసి టెస్కో ద్వారానే వస్త్ర ఉత్పత్తులను ప్రభుత్వ సంస్థలకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. చేనేత కార్మికులు ఇప్పటికే సరైన పనులు లేక దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని, టెండర్ విధానం అమలైతే వారి పరిస్థితి మరింత దారుణంగా మారనుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్బా విద్యాసంస్థలు వివిధ ప్రభుత్వ శాఖలకు తెలంగాణ రాష్ట్ర హైండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (టెస్కో) ద్వారా అందించే విధానాన్ని రద్దుచేసి ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు జరుగుతున్న కుట్ర సరికాదన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని వారిని అన్ని విధాల ఆదుకుంటామని అనేక వాగ్దానాలు చేసిన పాలకులు వాటన్నిటినీ తుంగలో తొక్కి చేనేత రంగాన్ని దెబ్బతీసే విధానాలను అనుసరించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే సదుద్దేశంతో 2024 మార్చి 11న జీవో ఇచ్చిన ప్రభుత్వం ఇందుకు విరుద్దంగా ప్రైవేటు సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించడం అన్యాయమని పేర్కొన్నారు. ఈఆలోచనను ప్రభుత్వం తక్షణమే ఉపసంహారించుకోవాలని లేకపోతే చేనేతల పోరాటాలు చవి చూడవలసి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# మహిళా భద్రత, సాధికారతకు పెద్దపీట

మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మహిళల రక్షణ, సంక్షేమం, ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం సరికొత్త కార్యాచరణను సిద్ధం చేస్తోంది. సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పలు శాఖల ఉన్నతాధికారులతో సోమవారం విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళలకు మరిన్ని సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**భద్రత కోసం ప్రత్యేక 'టాస్క్ ఫోర్స్' :**

మహిళల భద్రతను కేవలం చట్టపరమైన కోణంలోనే కాకుండా, మౌలిక వసతులు, సాంకేతికత, శాఖల సమన్వయంతో బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు. హోం, విద్యా, రవాణా, ఐటీ, మహిళా శిశు సంక్షేమ శా ఖల సమన్వయంతో రాష్ట్ర స్థాయి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటును పరిశీలించాలని మంత్రి సూచించారు. రాత్రి 8 గంటల తర్వాత ప్రయాణించే మహిళా ఉద్యోగుల కోసం జిపిఎస్ అనుసంధానిత రవాణా వ్యవస్థ ఉండాలని స్పష్టం చేశారు. విద్యాసంస్థలు,



కార్పొరేట్ కంపెనీల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలకు(ఐసిసి) తప్పనిసరిగా ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు.

**సంక్షేమం – ఆర్థిక సాధికారత:**

మహిళా సంఘాలు, అసంఘటిత రంగ కార్మికుల కోసం మంత్రి పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కోటి మంది మహిళా సంఘాల సభ్యులకు 'ఇందిరమ్మ మహిళా శక్తి' యూనిఫాం చీరలను పంపిణీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ మేరకు చీరల డిజైన్‌లను ఆమె పరిశీలించారు. స్వయం సహాయక బృందాల సభ్యులందరికీ సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, వారి హెల్త్ ప్రొఫైల్స్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాల కోసం 'ఇందిరమ్మ మహిళా శక్తి భవనాలు' నిర్మించనున్నట్లు తెలిపారు. వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లలో ప్రవేశాల కోసం ప్రభుత్వ యాప్ ద్వారా పారదర్శకత తీసుకురావాలని సూచించారు.

**అసంఘటిత రంగంపై ప్రత్యేక దృష్టి :**

అసంఘటిత రంగంలో పనిచేసే మహిళలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు, ఫిర్యాదుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గృహ హింస బాధితులకు ఆర్థిక తోడ్పాటు అందించేలా ప్రభుత్వ రుణాలతో స్వయం ఉపాధి కల్పించాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'మహిళల భద్రత అనేది ఒక్క శాఖ బాధ్యత కాదు, అది ప్రభుత్వ సమగ్ర కర్తవ్యం. సాంకేతికత, సమన్వయంతో పనిచేస్తేనే నిజమైన సాధికారత సాధ్యమవుతుంది' అని మంత్రి సీతక్క అన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదంతో మహిళా సాధికారతకు సంబంధించిన మరిన్ని నూతన పథకాలను ప్రారంభించనున్నట్లు మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో అధికారులు సంజయ్ కుమార్, శికా గోయల్, దివ్యా దేవరాజన్ పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి కార్యక్రమం విజయవంతం చేయాలి

పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా 99 రోజుల పాటు నిర్వహించనున్న ప్రజా పాలన ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధికారులను ఆదేశించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) ప్రధాన కార్యాలయంలో సోమవారం కార్పొరేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 14 వారాల పాటు ప్రజా పాలన ప్రగతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నట్లు తెలిపారు. శుభ్రత, ఆరోగ్యం, మహిళా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, చెరువుల సంరక్షణ, అగ్నిమాపక భద్రత తదితర సుమారు 25 అంశాలపై ఈ కార్యక్రమం కేంద్రీకృతమై ఉంటుందన్నారు. ప్రతి వారం ఒక ప్రత్యేక థీమ్‌ను ఎంపిక చేసి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. తొలి వారం శుభ్రత అంశంపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొదటి వారంలో ముఖ్యమంత్రి పర్యటించి క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను యథార్థంగా గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన



కార్యాచరణ ప్రణాళిక రూపొందించి 99 రోజుల ముగింపు నాటికి ఫలితాలు సాధించాలని అధికారులను దిశానిర్దేశం చేశారు. పట్టణాభివృద్ధి కార్యక్రమాల భాగంగా ఒక ప్రధాన రహదారిని ఎంపిక చేసి, దాన్ని ప్రపంచ స్థాయి మోడల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని సూచించారు. శుభ్రత, మెరుగైన వీధి దీపాలు, ఆకర్షణీయమైన పెయింటింగ్‌లు, హరితవనం, పాదచారి మార్గాలు, ఫౌంటెన్లు, వెండింగ్ జోన్లు, సైక్లింగ్ ట్రాక్లు వంటి సదుపాయాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. సిఎంసి కమిషనర్ జి.సృజన మాట్లాడుతూ రోడ్ల మధ్యభాగాలు (మీడియన్లు), రంగులు వేయడం ద్వారా పట్టణానికి నూతన శోభ తీసుకురావాలని సూచించారు. పోస్ట ర్లు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు గీతా రాధీక, డాక్టర్ యాదగిరిరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాములునాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం తరపున క్రీడాకారులకు ప్రోత్సాహం: మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రభుత్వ ప్రోత్సహంతోనే విద్యార్థి, యువకులు క్రీడల్లో రాణిస్తారని రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమ, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. 2026 27 బడ్జెట్ లో క్రీడాకారులకు ఆర్థిక సహాయం, ఇతర వసతులపై డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో సోమవారం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ తీసుకు వచ్చి, క్రీడలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను ఆటల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. అందులో భాగంగా క్రీడా శాఖకు 2026 27 బడ్జెట్ లో అధిక నిధుల కేటాయింపుతో పాటు, క్రీడాకారులకు ఆర్థిక సహాయంపై అధికారులతో చర్చించారు. ఒలంపిక్, పారా ఒలంపిక్, అంతర్జాతీయ, జాతీయ ఆటల పోటీల్లో పతకాలు సాధిందించిన వారికి ఆర్థిక సహాయం అందించేలా బడ్జెట్‌లో కేటాయింపులు ఉండేలా ప్రతిపాదనలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పాఠశాల విద్య నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఆటల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని చెప్పారు. క్రీడాకారులకు ఇచ్చే పారితోషికాలపై విధి విధానాలు రూపొందించాలని, వాటిని నిష్పక్షపాతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఎండి. సోనీ బాలాదేవితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కుమ్మెర ఘటనపై రాష్ట్ర బిసి కమిషన్‌కు కలెక్టర్ నివేదిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి మృతితో పాటు బిసిల ఆలయ సందర్శన నిరాకరణ సంఘటనకు సంబంధించి తెలంగాణ బిసి కమిషన్ ఫిబ్రవరి 23న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌ను నివేదిక కోరడంతో పాటు కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి ఫిబ్రవరి 24న కుమ్మెర గ్రామాన్ని సందర్శించి, వివరాలు తెలుసుకోవడం జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బధ్వావత్ సంతోష్ తమ నివేదికను ఎల్సి/256/2026 ద్వారా బిసి కమిషన్‌కు పంపారు. అందులో జిల్లా యంత్రాంగం ద్వారా ఫిబ్రవరి 25న పాప తండ్రి గణేష్‌కు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఫండ్ నుండి రూ. ఒక లక్ష ఇవ్వడం జరిగిందని, గణేష్‌కు నాగర్‌కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజిలో అవుట్‌సోర్సింగ్ జాబ్ ఇవ్వడంతో పాటు 2 పడకల గదిని ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పాప కుటుంబంతో మాట్లాడి, అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని వివరించడంతో పాటు ఈ రిపోర్టులో ఫిబ్రవరి 18న కుమ్మెర మల్లన్న జాతర నుండి 21వ తేదీ వరకు జరిగిన అన్ని సంఘటనలను కూలంకుషంగా వివరించడం జరిగిందని బిసి కమిషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## భయంతోనే కెసిఆర్, హరీష్ పిటిషన్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రూ.85కోట్ల అంచనాతో ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1.47 లక్షల కోట్లకు ఖర్చు చేశారని, ఇంత చేసినప్పటికీ మేడిగడ్డ వద్ద పిల్లర్ కుంగుబాటు జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. పత్రికల్లో కథనాలు వచ్చినందున తమ ప్రతిష్ట దెబ్బతిందని పిటిషనర్లు ఆందోళనతో కోర్టుకు వచ్చారంది. కమిషన్ విచారణకు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారని, నివేదిక వచ్చాక కమిషన్ ఏర్పాటు జీవో 6ను సవాలు చేశారని ఆక్షేపించింది. మేడిగడ్డ పిల్లర్ కుంగుబాటు తర్వాత రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో విచారణ కమిషన్ ఏర్పాటుకు ఇచ్చిన జీవో 6ను సవాలు చేస్తూ కేసీఆర్, హరీశ్, ఐఏఎస్ స్మిత సభర్వాల్, రిటైర్డు ఐఏఎస్ జోషి వేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి ఎం మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ సోమవారం విచారించింది. ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టు సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ మను సింఘ్వీ వాదిస్తూ.. కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందని సింఘ్వీ వాదించారు. మేడిగడ్డ కుంగుబాటుకు కారణమైనవాళ్లు ఎవరో తేలాల్సివుందని, కమిషన్ ఏర్పాటు జీవో జారీ సమయంలో ఆ ప్రక్రియను హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేయలేదన్నారు. ప్రజా ప్రయోజనాల నేపథ్యంలో నిజనిర్ధారణ కోసం కమిషన్ ఏర్పాటు అయ్యిందన్నారు. పిటిషనర్లు ఎందుకు భయడపతున్నారో అర్థం కావడం లేదన్నారు. కమిషన్ నోటీసు ఇస్తే సవాలు చేయలేదని, కమిషన్ విచారణకు సహకరించిన హరీశ్‌రావు నివేదికను సవాలు చేయడంలో ఆంతర్యం ఏమిటో తెలియడం లేదన్నారు. కమిషన్ ఏర్పాటు నిబంధనలోనే బాధ్యులను గుర్తించాలని ఉందని గుర్తు చేశారు. పిటిషనర్ కోరిన వివరాలన్నీ నోటీసు ద్వారా విచారణకు పిలిచినట్లు చెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రిపోర్టులో బ్యారేజ్ నిర్మాణంలోని లోపాల గురించి పేర్కొందని తెలిపారు. ప్రధానంగా నిపుణుల కమిటీ పరిశీలించి మేడిగడ్డలో రిజర్వాయర్ నిర్మాణం చేయవద్దని తేల్చి చెప్పినప్పటికీ గత ప్రభుత్వ అధినేత కేసీఆర్ ఖాతరు చేయలేదన్నారు. క్యాబినెట్‌లో చర్చకు చేయలేదని, క్యాబినెట్ ఆమోదం కూడా లేదన్నారు. నిర్మాణం చేయాలనే నిర్ణయం తీసుకున్న తరువాత కూడా ఆమోదం తీసుకోలేదన్నారు. వాదనలు మంగళవారం కొనసాగనున్నాయి.

## దివ్యాంగులందరికీ బస్సులో ఉచిత ప్రయాణం అబద్ధం

తప్పుడు వార్తలను నమ్మవద్దు: టిజిఎస్ఆర్‌టిసి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవల వివిధ సోషల్ మీడియాలో టిజిఎస్ఆర్‌టిసి బస్సుల్లో దివ్యాంగులకు సంబంధించి వస్తున్న వార్తలపై ఆర్‌టిసి యాజమాన్యం స్పష్టత ఇచ్చింది. దివ్యాంగులందరికీ బస్సుల్లో పూర్తిగా ఉచిత ప్రయాణం కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి కొత్త ఉత్తర్వులు జారీ చేయలేదని, సోషల్ మీడియాలో వస్తున్న ఈ వార్త పూర్తిగా అవాస్తవమని తెలిపింది. ఇలాంటి తప్పుడు వార్తలను సోషల్ మీడియాలో ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రజలు ఇటువంటి పుకార్లను నమ్మవద్దని, ఏదైనా కొత్త నిర్ణయం తీసుకుంటే పత్రికా ప్రకటన ద్వారా లేదా అధికారిక టిజిఎస్ఆర్‌టిసి వెబ్‌సైట్ ద్వారా గాని వెల్లడించడం జరుగుతుందని స్పష్టం చేసింది.

## బిసిలకు 'అత్యాచార నిరోధక చట్టం' తేవాల్సిందే

ఇందిరాపార్క్ ధర్నాలో జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో బిసిలపై అగ్రకులాల దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు రోజురోజుకి అధికమవుతున్నాయని, అందులో భాగంగానే నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర సంఘటనలో రెండు నెలల పసి పాప మరణించిందని, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, ఎస్టి అట్రాసిటీ చట్టం తరహాలో బిసిలకు 'అత్యాచార నిరోధక చట్టం' తీసుకురావాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సోమవారం బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ సమన్వయంతో కుమ్మెర ఘటనలో పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేయడంతో పాటు బిసిలకు కూడా రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్‌తో భారీ ధర్నా జరిగింది. ఈ ధర్నాలో ఎంఎల్‌సి తీర్మాన్ మల్లన్న, విజిఆర్ నారగోని, ప్రొఫెసర్ మురళీ మనోహర్, హరిశంకర్ గౌడ్, జానయ్య యాదవ్, విక్రమ్ గౌడ్ లతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రసగించారు. కుమ్మెర గ్రామంలో బిసి, దళితులపై రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు



దాడి చేసి, రెండు నెలల పసికందు మరణించిన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంతో వ్యహరిస్తుందని, దాడి జరిగి పది రోజులు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. బిసిలపై దాడులు నిత్యకృ త్యంగమారాయని, నాటి సర్దార్ సర్వాయి పాపన్న, మారోజు వీరన్న మల్ల నుండి మొదలు కుంటే నేటి కుమ్మర ఘటన వరకు రాష్ట్రంలో ఏదో ఒకచోట సాంఘిక బహిష్కరణలు, కులం పేరుతో దూషించి దాడులు చేయడం, అత్యాచారాలు, హత్యలు చేయడం జరుగుతున్నాయని, వీటిని ఎదురుకోవడానికి బిసి సమాజమంతా ఐక్యంగా ఉద్యమించాలని, ఇక నుండి బిసిలను అగ్రకులాలు గ్రామలలో బహిష్కరిస్తే.. బిసిలంతా ఏకమై అగ్రకులాలకు ఓటు వేయకుండా బహిష్కరించాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.

## బోయిన్‌పల్లి మార్కెట్ అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీ



**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** బోయిన్‌పల్లి మార్కెట్ అభివృద్ధికి అన్ని చర్యలు చేపడతామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం, అధికారులతో మార్కెట్ అభివృద్ధిపై ఎమ్మెల్యే శ్రీగణేష్ సమీక్ష నిర్వహించారు. బోయిన్ పల్లి మార్కెట్ అభివృద్ధి, మార్కెట్‌కు వచ్చే రైతులకు, హమాలీలకు సౌకర్యాలు, మార్కెట్‌కు ఆదాయ వనరులను పెంచడం, మార్కెట్ లో పరిశుభ్రత, మార్కెట్‌లో చేపట్టవలసిన మౌలిక వసతులపై చర్చించారు.

## వాటర్ స్పోర్ట్ అకాడమీలో ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో:** బోయినపల్లిలోని వాటర్‌స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి ఈ నెల 12లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాదికారి ఆర్.కోటాజి ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. కాయాకింగ్,కెనోయింగ్, రోయింగ్,ఫెన్సింగ్ తదితర వాటర్ స్పోర్ట్స్ యందు శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. అయిదవ తరగతిలో పది మంది బాలికలకు, పది మంది బాలురకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు.ఇక్కడ శిక్షణ పొందే గిరిజన బాలబాలికలకు ప్రత్యేకమైన ఆహారం, వసతి. స్పోర్ట్స్ దుస్తులు, షూస్‌లతో పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 31నాటికి 9 నుండి 11సంవత్సరముల లోపు వయసు ఉండి ప్రస్తుతం నాల్గవ తరగతి చదువుతున్న వారు దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు.

## బిసిల అత్యాచార నిరోధక చట్టం తేవాలి

-బిసి సంఘాల నేతల డిమాండ్



**ప్రజాపక్షం/కవాడీగూడ:** రాష్ట్రంలోని రెడ్డి ప్రభుత్వం కుమ్మరులు, చాకలి, దళిత కుటుంబాలపై దాడి చేసి హత్యా కేసులలో దోషులైన తమ రెడ్డి కులస్తులను రక్షిస్తుందని.. అందుకే ఈ రోజు వరకు నిందితుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తోందని బిసి సంఘాల మహాధర్నాలో పాల్గొన్న నేతలు ఆరోపించారు. ఈ మేరకు ఇందిరాపార్క్ వద్ద బాధితులకు అండగా జరిగిన మహాధర్నాలో పాల్గొన్న బిసి సంఘాల నేతలు ఎర్ర సత్యనారాయణ, తీన్మార్ మల్లన్న, జాబుల శ్రీనివాస్‌గౌడ్, వీజేఆర్ నారగోని, ప్రొఫెసర్ మురళీమహనోహర్, వీ.జానయ్య, ఎస్ హరిశంకర్, గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, శ్రావణి తదితరులు మాట్లాడుతూ... తక్షణమే ప్రియాంకరెడ్డి కేసులో జరిగిన సత్వర న్యాయం ఇక్కడ కూడా జరగాలని, లేదంటే ఇది కూడా రెడ్డి ప్రభుత్వం అవుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల హామీ మేరకు, ఈ ఘటనల నేపథ్యంలో తక్షణమే ఇదే అసెంబ్లీలో బిసిల అత్యాచార నిరోధక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. మహాధర్నాలో పీ.సతీష్, పీ.సుధాకర్ ముదిరాజ్, పాండుయాదవ్, సాగర్‌దాస్, వెంకటరాముడు, సంధ్య, మధుసూప్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ చేనేత ప్రదర్శన



**ప్రజాపక్షం/కవాడీగూడ:** తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద ఉన్న ఎన్‌టీఆర్ స్టేడియంలో ఏర్పాటైన జాతీయ చేనేత ప్రదర్శనను సంస్థ కమిషనర్ శైలజా రామయ్యర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈనెల 15 వరకు ఈ ప్రదర్శన ఉంటుందని, చేనేత కుటుంబాలకు ఈ ప్రదర్శన చేయూత నిస్తుందని ఆమె అన్నారు. జాతీయ స్థాయిలో చేనేత వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంటాయని తెలిపారు.

## మీటర్ రీడర్ కార్మికుల ధర్నా




**ప్రజాపక్షం/కవాడీగూడ:** డిమాండ్ల సాధనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ మేరకు ధర్నాలో పాల్గొన్న విద్యుత్ కార్మికులకు ఎంపీ ఈటల రాజేందర్ సంఘీభావం తెలిపారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మీటర్ రీడర్ కార్మికులు మాట్లాడుతూ.. 25 ఏండ్లుగా సంస్థను నమ్ముకుని పనిచేస్తున్నా న్యాయం జరగడం లేదని వాపోయారు.

## ట్రై కార్పొరేషన్లలో విజయం ఖాయం




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ట్రై మున్సిపల్ కార్పొరేషన్లలో విజయం ఖాయమని ఎమ్మెల్యే దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని నందినగర్, నూర్‌నగర్, ఇబ్రహీంనగర్, మిథాలీనగర్, దేవరకొండ బస్తీలలో ఎమ్మెల్యే దానం పర్యటించడం జరిగింది రూ. కోటి 50 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు వర్క్స్, సీవరేజ్ వర్క్‌లకు ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీ, గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను కూడా కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని చెప్పారు. 300 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేసి సీఎం రేవంత్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్,మాజీ కార్పొరేటర్ భారతి నాయక్, బాబా నాయక్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు జావిద్, అంథోని, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మెడిసిన్స్‌తో పాటు పోషకాహారంతో టిబి నిర్మూలన

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

'ప్రాజెక్టు ఓజస్' ప్రారంభం







**ప్రజాపక్షం / సిటీ బ్యూరో :** టిబి వ్యాధి గ్రస్తులకు మెడిసిన్స్‌తో పాటు పోషకాహారం అందిస్తే వ్యాధిని త్వరగా నిర్మూలించవచ్చని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. టిబి(ట్యూబరో క్లోసిస్) రోగులకు పోషకాహారం అందించడం కార్పోరేట్ బాధ్యత(సిఎస్‌ఆర్) కింద సోమవారం నాంపల్లిలోని కేర్ ఆసుపత్రిలో 'ప్రాజెక్ట్ ఓజస్' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. టిబి ముక్త భారత్ అభియాన్ పరిధిలో జిల్లా పరిపాలన సహకారంతో జగతి ఫౌండేషన్, కేర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. టిబి సంక్రమణ వ్యాధి అని చెప్పారు. సమయానికి గుర్తించి చికిత్స తీసుకుంటే నయమవుతుందన్నారు. ఈ వ్యాధిని అసహ్యంగా చూడవద్దని తెలిపారు. ఇది కేవలం ఊపిరి తిత్తులకే కాకుండా శరీరంలోని ఇతర భాగాలను కూడా ప్రభావితం చేయగలదన్నారు. ఇది సోకితే పోషకాహారం లోపం , వ్యాధి నిరోధక శక్తిని తగ్గించి ప్రబలడానికి కారణమవుతుందన్నారు. ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్సను పూర్తిగా తీసుకోవాలన్నారు. హైదరాబాద్ జిల్లాలో 19టిబి చికిత్స కేంద్రాలున్నాయన్నారు. వీటిలో పదివేలకు రోగులు చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఇప్పటి వరకు 7.5లక్షల మందికి హైస్క్రీనింగ్ నిర్వహించమన్నారు. మరి కొన్ని నెలల్లో మరో 2.5లక్షల మందికి హైస్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వ్యాధి గ్రస్థులకు రూ.25లక్షల విలువైన 500ల పోషకాహార కిట్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. టిబి నిర్మూలన కోసం నిరంతర పర్యవేక్షణ, సమీక్ష నిర్వహిస్తున్నందుకు టిబి నిర్మూలనాధికారిణి డాక్టర్ చల్లాదేవిని ఈ సంర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి అభినందించారు. ఈ కార్యక్రమంలో కేర్ హాస్పిటల్స్ సిఇఒ పవన్‌కుమార్, చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ నిఖిల్ మాథూర్, జగతి ఫౌండేషన్ సిఇఒ దుర్గా కల్యాణి, డాక్టర్ పైజాన్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## గంధంగూడలో రూ.600 కోట్ల ప్రభుత్వ భూమి రక్షణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఐటీ కారిడార్‌కు ఆనుకుని గంధంగూడలో 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) రక్షించింది. ఈ భూమి విలువ సుమారు రూ.600 కోట్ల వరకు ఉంటుందని అంచనా. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ సర్వే నెంబర్ 86/పి లోని ఈ భూమిని జలమండలికి ప్రభుత్వం కేటాయించింది. అయితే కొందరు అక్రమంగా షెడ్డులు వేసి ఆక్రమణలకు పాల్పడ్డారు. జలమండలి విజ్ఞప్తి మేరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలను తొలగించారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం కేటాయించిన మొత్తం భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశారు.

# ఆడపిల్ల చదువు అవనికి వెలుగు

పిఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండు రంగారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆడపిల్ల చదువు అవనికి వెలుగు అని పిఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండు రంగారావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని మహబూబ్ బియా గవర్నమెంట్ బాలికల పాఠశాలలో పిఆర్‌ఆర్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షల కోసం రూపొందించిన లాస్ట్ మినిట్ రివిజన్ బుక్‌లను ఎస్‌సిఆర్‌టి ఫ్యాకల్టీ ఆర్.మంగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాండు రంగారావు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యతోపాటు క్రీడా, సాంస్కృతిక రంగం,సైన్స్ రంగంలో రాణించేందుకు కృషిచేయాలని ఆయనవిద్యార్థులకు పిలుపునిచ్చారు. మహాత్మ జ్యోతిభా ఫూలే, డా.బిఆర్.అంబేద్కర్ వంటి మహనీయులనుస్ఫూర్తిగా తీసుకొని మంచి భవిష్యత్తు వైపు అడుగులేయాలని సూచించారు. పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు తెచ్చుకొని, తమ తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో బోధనా సిబ్బంది, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల నిర్వహణ, సదుపాయాల పరిశీలన

కలెక్టర్ ఆకసిక తనిఖీ



**ప్రజాపక్షం/సిటీ బ్యూరో:** హైదరాబాద్ జిల్లాలో సోమవారం ఇంటర్ పరీక్షలు జరుగుతున్న మౌలానా ఆజాద్ మోమోరియల్ ప్రభుత్వ బాలికల కళాశాల కేంద్రాన్ని కలెక్టర్ హరిచందన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పరీక్షల నిర్వహణ తీరు, సదుపాయాల కల్పనను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. పరీక్షలు ముగిసే వరకు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు. జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం గణితం(1ఎ) పరీక్షకు 91,029 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఒడ్డెన్న తెలిపారు. మొత్తం 217 'పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. సోమవారం నాటి పరీక్షకు మొత్తం 96,077 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా వీరిలో జనరల్ గణితం పరీక్షకు 87,684 మంది, వొకేషనవొకేషనల్ పరీక్షకు 3345 మంది హాజరయ్యారు. జనరల్‌లో 4112 మంది, వొకేషనల్‌లో 936 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి, సిపిఒ శివరామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎంసి తొలి సర్వసభ్య సమావేశం 15 అంశాలపై విస్తృత చర్చ

ప్రజాపాలన కార్యక్రమంపై జయేష్ రంజన్ దిశనిర్ధేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మల్కాజిగిరి నగరపాలక సంస్థ (ఎంఎంసి)లో తొలి సర్వసభ్య సమావేశం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎంఎంసి ప్రత్యేకాధికారి జయేష్ రంజన్ అధ్యక్షతన సోమవారం జరిగింది. మల్కాజిగిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఎజెండాలోని 15 కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ క్రిష్ణారెడ్డి, జోనల్ కమిషనర్లు, ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. నగరాభివృద్ధి, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్ల తదితర అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణపై దిశనిర్ధేశం చేశారు.



# సిఆర్‌ఎస్‌ను తనిఖీ చేసిన దక్షిణ మధ్య రైల్వే

జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం తిరుపతిలోని క్యారేజ్ రిపేర్ షాప్ (సిఆర్‌ఎస్)ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్శనలో చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ ఎస్. శ్రీనివాస్, గుంతకల్లు డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ యు. సుధాకర్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. తనిఖీ సందర్భంగా జిఎం సి.బి.ఆర్ షాప్ పనితీరును సమీక్షించడంతో పాటు వందే భారత్ కోచ్‌లు, సాంప్రదాయ ఎసి కోచ్‌లను పరిశీలించారు. సి.ఎఫ్ (క్యారేజ్ ఫిట్టింగ్) షాప్, బోగీ సెక్షన్, వీల్ ప్రెస్ మెషిన్, ఆటోమేటిక్ జర్నల్ టర్నింగ్, బర్నిషింగ్ (ఎజెటిబి) యంత్రం వంటి విభాగాలను సందర్శించి, మొత్తం వర్క్‌షాప్ కార్యకలాపాలపై అవగాహన పొందారు. అవుట్‌గోయింగ్ షాప్‌లోని కోచ్‌లు, బయో టాయిలెట్లు, ఓవర్‌హాలింగ్ సెక్షన్ పనితీరును కూడా పరిశీలించారు. వర్క్‌షాప్‌లోని అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించిన జిఎం సిబ్బందితో మాట్లాడి, విధుల్లో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు వర్క్‌షాప్ మాస్టర్ ప్లాన్‌తో పాటు భవిష్యత్ విస్తరణ ప్రణాళికలను ఆయనకు వివరించారు. అనంతరం వర్క్ షాప్ పనితీరు, పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు సమర్పించగా, భవిష్యత్ చర్యలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ ప్రతినిధులతో కూడా జిఎం సమావేశమై వారి విజ్ఞప్తులను స్వీకరించారు. ఉత్పాదకత, నాణ్యత, హౌస్ కీపింగ్ మెరుగుదలతో పాటు ప్రయాణీకుల భద్రతను పెంపొందించేందుకు సాంకేతిక మార్పులను స్వీకరించడంలో అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషిని జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ ప్రశంసించారు.

# రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ దాడులు

భారీగా వాహనాలు, ఇసుక, పిడిఎస్ సరుకులు స్వాధీనం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా అక్రమ రవాణా, పన్ను ఎగవేత, అక్రమ ఇసుక తవ్వకాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. రవాణా, రాష్ట్ర పన్నులు, గనులు, భూగర్భ శాస్త్రం, అటవీ, పౌర సరఫరాలు, పోలీసు శాఖలతో కలిసి ప్రధాన రహదారులు, రింగ్ రోడ్ ప్రవేశాలు, టోల్ కేంద్రాల వద్ద ఉమ్మడి తనిఖీలు, ఆకస్మిక దాడులు, రాత్రి పర్యవేక్షణ చేపట్టారు. ఈ నెలలో వెయ్యికి పైగా వాహనాలను తనిఖీ చేసి, వివిధ నిబంధనల ఉల్లంఘనల కారణంగా రెండు వందలకు పైగా వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అధిక బరువు, పన్నులు చెల్లించకపోవడం, అనుమతులు లేకపోవడం, సరుకు రవాణా పత్రాలు లేకపోవడం వంటి కారణాలతో కేసులు నమోదు చేశారు. ఇసుక, కంకర, ఇటుకల అక్రమ రవాణాపై కూడా చర్యలు తీసుకున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలపై నిర్వహించిన మెరుపు దాడుల్లో 24 వాహనాలు, 6 తవ్వే యంత్రాలు, 2 లారీలు, 1 టిప్పర్, 15 ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 245 మెట్రిక్ టన్నుల ఇసుకను పట్టుకుని 19 మందిని అరెస్టు చేయడంతో పాటు సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం, గోధుమల అక్రమ మళ్లింపుపై జరిపిన తనిఖీల్లో సుమారు 131 క్వింటాళ్ల బియ్యం, 27 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 5.8 లక్షలు. సంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోని సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి పలు లోపాలను గుర్తించారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. ఈ నెలలో మొత్తం రూ. 10.79 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయ నష్టాన్ని గుర్తించగా, అందులో రూ. 1.96 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అక్రమ గనుల తవ్వకం, పన్ను ఎగవేత, ప్రభుత్వ వనరుల దుర్వినియోగంపై చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధులు లేదా వనరుల దుర్వినియోగంపై సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14432 కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఇరాన్ అణుశుద్ధి కేంద్రంపై దాడి జరిగిందా? లేదా?

**వియన్నా:** ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై అమెరికా–ఇజ్రాయెల్ దాడి చేశాయని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) అత్యవసర సమావేశం అనంతరం ఇరాన్ దౌత్యవేత్త రెజా నజాఫి ప్రకటించారు. ఇరాన్‌లో యుద్ధ పరిస్థితి, ఆ దేశం చేపట్టిన అణుకార్యక్రమంపై చర్చించేందుకు ఐఎఇఎ అత్యవసర సమావేశం సోమవారం వియన్నాలో జరిగింది. ఐఎఇఎలో ఇరాన్ తరపున సభ్యుడుగా ఉన్న దౌత్యవేత్త నజాఫి పాత్రికేయులతో మాట్లాడుతూ ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై దాడులు జరిగాయన్నారు. ఐతే ఇది కేవలం ఆరోపణ మాత్రమేననీ, దీనికి తగిన సాక్ష్యాధారాలు లేవని, ఈ విషయంపై ఆరా తీస్తామని ఐఎఇఎ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సీ స్పష్టం చేశారు. నిజంగా దాడి జరిగితే అణుధారికత వెలువడుతుందని, గాలిలో దాని పరిమాణం పెరుగుదల సంకేతాలు ఏమీ కనిపించలేదని అన్నారు. ఈ విషయంపై ఆరా తీయాల్సి ఉందని, అదే జరిగితే ఆ ప్రాంత ప్రజలను అక్కడి నుండి ఖాళీ చేయించాల్సి వస్తుందని అన్నారు. ఇది వాస్తవం కాదన్నారు. గత ఏడాది జూన్‌లో నతాంజ్ సెంటర్‌పై అమెరికా దాడులు చేసింది.

## అవసరమైతే యుద్ధంలోకి అమెరికా సైన్యం

**వాషింగ్టన్:** అవసరమైతే ఇరాన్ యుద్ధంలోకి అమెరికా సైన్యం ప్రవేశిస్తుందని డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. సోమవారం రాత్రి న్యూయార్క్ పోస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరాన్ యుద్ధంలోకి అమెరికా సైన్యం ప్రవేశించే అవకాశాలను తోసిపుచ్చేందుకు తిరస్కరించారు. ఇప్పటివరకూ అమెరికా సైన్యం ప్రత్యక్షంగా యుద్ధ రంగంలో లేదని అవసరమైతే రంగంలోకి వస్తుందన్నారు. అదేవిధంగా త్వరలో భారీ దాడులకు అమెరికా సిద్ధమవుతుందన్నారు. రక్షణమంత్రి హెగ్సెత్ కూడా ఇదే సమాధానం చెప్పారు. ఇరాన్‌లో యుద్ధం మొదలైన తర్వాత తన వైఖరిని ట్రంప్ స్పష్టంగా వివరించలేదు. ఐతే వైట్‌హౌస్‌లో ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ హానర్ కార్యక్రమంలో ఆయన ఇరాన్ యుద్ధం, అమెరికా స్థావరాలపై దాడుల విషయాలను ప్రస్తావిస్తారు. అదేవిధంగా ఇరాన్‌లో యుద్ధంపై అమెరికా కాంగ్రెస్‌లో కూడా చర్చ ప్రారంభం కానున్నది.

## జలమండలిలో కాగిత రహిత కార్యకలాపాలు

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** ఇక నుంచి ప్రతి ఫైలు మాన్యువల్‌గా స్వీకరించడం జరగదని.. ఈఆఫీస్ ద్వారా పంపించాలని... జలమండలిలో కాగిత రహిత కార్యకలాపాలు చేపడుతున్నట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో ఈఆఫీస్‌ను జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ప్రారంభించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ... జలమండలి అన్ని కార్యాలయాల్లో ఈఆఫీస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని నిర్ణయించామని.. దీనివల్ల కార్యాలయాల్లో సామర్థ్యం, పారదర్శకత, బాధ్యతతో పాటు సేవల ప్రమాణాలు మెరుగుపడనున్నాయని అన్నారు. ఈఆఫీస్ విధానం ద్వారా ఫైళ్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని, అలాగే పరిపాలనలో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. ఈఆఫీసులో ఫైళ్లను స్కాన్ చేసి భద్రపరచడమే కాకుండా వివిధ విభాగాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈ ఆఫీసులో పొందుపరచడం జరుగుతుందని, సంబంధించిన అధికారి ఎవరైనా వారి విభాగపు ఫైల్స్ ఈఆఫీసులో సరిచూసుకునే వెసులుబాటు ఉండటంతో పరిపాలన సులభతరం అవుతుందని అన్నారు. ముందుగా ప్రధాన కార్యాలయంలో అన్ని కార్యకలాపాలను ఈఆఫీస్‌లో నిర్వహిస్తామని.. విడతల వారీగా అన్నీ డివిజన్‌లలో ఈ విధానాన్ని అమలు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్(పర్సనల్) మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, సీజీఎం (రెవెన్యూ) కిరణ్ కుమార్‌తో పాటు రెవిన్యూ, ఐటీ విభాగపు అధికారులు పాల్గొన్నారు.



## పటాన్‌చెరు సర్కిల్–46లో కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పటాన్ చెరు సర్కిల్–46లో పలు ప్రాంతాల్లో కమిషనర్ జి. సృజన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్ చెరు డంపింగ్ యార్డును సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. డిఈఈ, ఏఈఈ, గ్రూప్–1 ట్రైనీ అధికారి, పారిశుద్ధ్య సిబ్బంది, రాంకీ సంస్థ ప్రతినిధులు తనిఖీలో పాల్గొన్నారు. డంపింగ్ యార్డులో వ్యర్థాల నిర్వహణ విధానం, పారిశుద్ధ్య పనులు, ఆర్ అండ్ బి రహదారుల పరిస్థితిని కమిషనర్ పరిశీలించారు. ఐఏఎల్‌ఏ ప్రాంతంలో పారిశుద్ధ్య లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేసి జరిమానా విధించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేయడం, డంపింగ్ యార్డ్ నిర్వహణ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం వంటి అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# పట్టాలురాని వారికి పట్టాలివ్వాలి

సిపిఐ వినతి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: మేడ్చల్ జిల్లా మేడిపల్లి భగత్‌సింగ్ నగర్ కాలనీలో పట్టాలు రాని వారికి పట్టాలివ్వాలని సిపిఐ కోరింది. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, జిల్లా కార్యదర్శి ఉమామహేష్‌లు మాట్లాడుతూ భగత్‌సింగ్‌నగర్ కాలనీ సర్వే నంబర్ 48లో సిపిఐ ఆధ్వర్యంలో 2007సంవత్సరంలో పేదలకు గుడిసెలు వేయగా గత ప్రభుత్వం 58 జిఓ మేరకు కొంతమందికి పట్టాలిచ్చారన్నారు. వెరిఫికేషన్ జాప్యం అవటంతో పట్టాలు దక్కని వారు మరి కొందరు ఉన్నారని, వీరికి సైతం పట్టాలివ్వాలని కోరారు. అదే విధంగా ఈ సర్వే ప్రాంతంలో కబ్జాదారులు స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, వీరిని గుర్తించి చర్యలు తీసుకోవటంతో పాటు గత లబ్దిదారులందరికి పట్టాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్‌రెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేందర్, ఉప్పల్ మండల కార్యదర్శి సత్యప్రసాద్, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి లక్ష్మి, ఘట్‌కేసర్ మండల కార్యదర్శి ఈశ్వర్, మేడిపల్లి మండల సిపిఐ నాయకులు సిహెచ్ మాధవి, కె.ప్రమీల, దండు రమేష్, జయచంద్ర, జి.నాగరాజు, కె.మహాలక్ష్మి, బాపురాజు, విబి బాలరాజ్, ఇస్తారి, సోమరాజు,ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రజావాణిలోఎఐవైఎఫ్ వినతి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : పోటీ పరీక్షలకు వెళ్లే అభ్యర్థుల కోసం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఎఐవైఎఫ్ కోరింది. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఎఐవైఎఫ్ బృందం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, జిల్లా అధ్యక్షుడు సల్మాన్‌బేగ్, కార్యదర్శి టి.సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ టిజిపిఎస్‌సి గ్రూప్ 1,2,3,4. ఎస్సై, కానిస్టేబుల్, ఫైర్‌మెన్, జైల్ వార్డెన్, స్కూల్ అసిస్టెంట్ లాంటి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు జిల్లాలో సరైన శిక్షణా అవకాశాలు లేకపోవటం వల్ల ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు వెళ్లి పెద్ద మొత్తాల్లో డబ్బులు చెల్లించాల్సి వస్తోందన్నారు. పేద విద్యార్థులకు సహకరించే విధంగా ప్రభుత్వపరంగా ఉచిత కోచింగ్ సెంటర్లు నెలకొల్పాలని వారు కోరారు. కోచింగ్ వెళ్లే వారి దరఖాస్తులు జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా స్వీకరించే విధంగా ప్రణాళిక రూపొందించాలన్నారు.



## హెల్మెట్ లేని బైకు రైడర్లకు ఉచిత హెల్మెట్లు

కొత్తది కొనుగోలు చేసుకొని మరుసటి రోజు వాపస్ చేయాలి

ప్రజాపక్షం/మల్కాజిగిరి:హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు నడిపిస్తున్న వారికి మల్కాజిగిరి కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసులు ముందస్తుగా ఉచితంగా హెల్మెట్లు ఇచ్చే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. అయితే ఉచితంగా పోలీసుల నుండి హెల్మెట్‌ను తీసుకొని వెళ్లి సొంతంగా హెల్మెట్ కొనుక్కొని మరుసటి రోజు పోలీసులకు తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుంది. నేరేడ్‌మెట్ వాయుపరి ప్రాంతంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో హెల్మెట్ వినియోగం పట్ల కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వాటి అవసరాన్ని తెలిపి అవగాహన కల్పిస్తున్నామని ట్రాఫిక్ విభాగ డిసిపి తెలిపారు.



## భావితరాలకు ఆదర్శనీయుడు శ్రీపాదరావు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పీకర్‌గా ఆ పదవికే వన్నె తెచ్చిన దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు భావితరాలకు ఆదర్శనీయుడిగా నిలిచారని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్పీకర్‌గా ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో విశిష్ట పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీఓ, చంద్రావతి వివిధ ప్రభుత్వ శాఖాధికారులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

అలియాబాద్ చైర్ పర్సన్ శిరీషా కృష్ణారెడ్డి



ప్రజాపక్షం/శామీర్‌పేటః అలియాబాద్ మున్సిపాలిటిని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని అలియాబాద్ మున్సిపాలిటి చైర్ పర్సన్ కమతం కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటిలోని తుర్కపల్లిలోని 2వ వార్డులో రాజీవ్ రహదారి నుంచి శివాలయం వరకు సిసి రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ శిరీషా కృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ జనరల్ ఫండ్ నిధుల నుంచి అంచనా వ్యయం రూ.16.60 లక్షలతో తుర్కపల్లిని 2 వ వార్డు లో సిసి రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేశామని చెప్పారు. అదే విధంగా అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతీ మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఎల్లు దీపిక వరప్రసాద్‌రెడ్డి, గాదె వెంకటేష్, గూదె వెంకటేష్, ఎఇఇ సనా షాహీన్, మేడ్చల్ జిల్లా ఎ బ్లాక్ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షల్లో 1686 మంది గైర్హాజరు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా సోమవారం మేడ్చల్ జిల్లాలో జరిగిన మొదటి సంవత్సర గణిత, బోటనీ, పొలిటికల్ సైన్స్ పేపర్ పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి మాల్ ప్రాక్టీసింగ్ కేసులు నమోదు కాకుండా ముగిసిందని జిల్లా ఇంటర్‌మీడియట్ అధికారి కిషన్ తెలిపారు. జల్లా వ్యాప్తంగా హాజరు కావాల్సిన 73,522 మంది విద్యార్థులకు గాను1686 మంది గైర్హాజరు అవటంతో 71,836 మంది హాజరు అయ్యారని తెలిపారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/పరిగి : జనహృదయనేత బిజెపి పరిగి అసెంబ్లి ఇన్‌చార్జీ మారుతి కిరణ్ భూనేటి జన్మదిన వేడుకలు పరిగి లోని అయన నివాసంలో నియోజకవర్గం బిజెపి నేతలు అభిమానులు, పులమాలలు వేసి , శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గానికి ప్రజానేత అని పేదల పెన్నిధి పరిగి నియోజకవర్గం నుండి తప్పనిసరిగా మారుతి కిరణ్ ఎమ్మెల్యేగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## రాహుల్ గాంధీ పర్యటనతో అరెస్టులు

ప్రజాపక్షం/నవాబుపేట్ః ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, వికారాబాద్ జిల్లా పర్యటన నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బివిఎచ్‌పిఎస్) నేతలను పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని దివ్యాంగుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందనీ భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పోతురాజు సుధీర్ అన్నారు. దివ్యాంగుల హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న తమ సంఘం నేతలను ముందస్తు అరెస్టుల పేరుతో పోలీస్ స్టేషన్లకు తరలించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వికారాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా బంట్వారంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులును దారూర్ మండలంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరిజన్ బాలరాజ్ ను, దోమ మండలంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం చుక్కయ్యను, జిల్లా వర్కింగ్ కమిటీ అర్ధరాత్రి వేళ బలవంతం గా అదుపులోకి తీసుకోవడం బాధాకరమని అన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా దివ్యాంగుల హక్కుల సాధనకై మా పోరాటం ఆగదు అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండివైఖరి వీడి అసెంబ్లీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలి. లేని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతంచే ప్రభుత్వాన్ని గద్దె దించుతామని వెల్లడించారు.



## పార్వతీ పరమేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాపక్షం/నవాబుపేట్ః మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామంలో గతవారం. రోజులుగా ఎంతో అంగరంగ వైభవంగా జరుగుతున్న పార్వతీ పరమేశ్వరుల ఎంతో వైభవంగా జరుపుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల ఆశీర్వాదాన్ని స్వీకరించిన చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎల్లకొండ సర్పంచ్ కొండల్ యాదవ్ సమక్షంలో ఎల్లకొండ గుట్టపై వెలిసిన పార్వతీ పరమేశ్వరుల, ఆశీర్వాదం తీసుకోవడం జరిగిందని అన్నారు. పార్వతీ పరమేశ్వరుల ను పూజించిన ప్రతి ఒక్క కుటుంబానికి అష్టైశ్వర్యాలతో ఆనందంగా ఉంటారని శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కొట్టదని అందువల్లనే ప్రతి కుటుంబం ఆ ఈశ్వరుని నామస్వరములు ఉండాలని గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్ అన్నారు. ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఎల్లకొండ లో జరిగే ఉత్సవాలకు రావడం ఎంతో ఆనందంగా ఉందని గ్రామ సర్పంచ్ కొండలు యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయినాథ్ యాదవ్, రామచంద్రయ్య, ఉప సర్పంచ్, ఎం.ప్రకాష్, అజముద్దీన్, గాలయ్య, వెంకటయ్య, నరేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలుకు సన్మానం

ప్రజాపక్షం/చర్లపల్లిః నాగారం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ వనజారామిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి విచ్చేసి 36 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి వివిధ హోదాలలో పనిచేసిన ఆమెకు చంద్రారెడ్డి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి శ్రీరాములు, వెంకటేశ్వర్లు, రామేశ్వర్, ఆనంద్‌రెడ్డి, జమదగ్ని,వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ప్రెస్‌క్లబ్‌లు ముందుండాలి : విరాహత్ అలీ

ప్రజాపక్షం/చర్లపల్లిః ప్రెస్ క్లబ్‌లు జర్నలిస్టుల సంక్షేమంతో పాటు సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టడంలోనూ ముందుండాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె విరాహత్ అలీ సూచించారు.నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా కమిటీ ప్రతి నిధులు సోమవారం అధ్యక్షులు విరాహత్‌అలీ,కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు జ్యోతిర్మయ చారి,ప్రధాన కార్యదర్శి ఆదిమూల శ్రీనివాస్,కోశాధికారి సురేష్‌లను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు చంద్రమౌళి, సహదేవచారి, శ్రీనివాసరావు, చంద్రమోహన్, కె రమేష్, శ్రీనివాస్,శంకర్, బాల్‌రెడ్డి, ఆర్ నర్సింగ్‌గౌడ్, పవన్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేను కలిసిన ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

ప్రజాపక్షం/చర్లపల్లిః నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రింట్ మీడియా ప్రధాన పత్రికల ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికైన కార్యవర్గానికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. పాత్రికేయుల అభ్యున్నతికి తన సంపూర్ణ తోడ్పాటును అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలు, ఇబ్బందులను ఎప్పటికప్పుడు వెలికితీసి జర్నలిజం విలువలను పెంచేలా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతిర్మయచారి, శ్రీనివాస్, కోశాధికారి సురేష్, ఉపాధ్యక్షులు పవన్, బాల్‌రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి బాల్‌రాజ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి రోజా రాణి, సలహాదారులు చంద్రమౌళి, కెసి మోహన్, సత్యనారాయణ, కె రమేష్,వి శ్రీనివాస్,వి శంకర్,తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులు ఎఐతో పోటీపడాలి

ట్రస్మా రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : రానున్న కాలం కృత్రిమ మేథ (ఎఐ)దేనని, విద్యార్థులు ఎఐతో పోటీపడే స్థాయిలో తమ ప్రతిభను పెంపొందించుకోవాలని ట్రస్మా రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు కె.రామేశ్వర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం జగద్గిరిగుట్టలోని రాజీవ్ గృహకల్పలోని సంస్కృతి పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన నమూనాలు, వర్కింగ్ మోడళ్లు, భౌతిక, రసాయన శాస్త్ర ప్రయోగాలను పరిశీలించారు.విద్యార్థులు సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం ఎంతో ఆకట్టుకుందని అభినందించారు. ప్రస్తుత కాలంలో ఎఐ విస్తృతంగా ప్రాచుర్యంలోకి వస్తున్న తరుణంలో పాఠశాల స్థాయిలోనే వినూత్న ఆలోచనలతో ప్రాజెక్టులు రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకుని, సృజనాత్మకతతో ముందుకు సాగితేనే భవిష్యత్తులో సక్సెస్ సాధించగలరని సూచించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన బ్లడ్ గ్రూప్ పరీక్షల్లో ఆయన పాల్గొని రక్త పరీక్ష చేయించుకున్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థుల తల్లి దండ్రులు సుమారు 60మందికి విద్యార్థులే బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించి వారి గ్రూపులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గడ్డమీది బాలరాజు, ట్రస్మా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు, ట్రాపసా గ్రేటర్ కుత్బుల్లాపూర్ అధ్యక్షులు వినోద్ జాదవ్, వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సిహెచ్ నరసింహులు గౌడ్, సురభి విద్యాలయం కరస్పాండెంట్ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ పూర్తయి 47 ఏళ్ల తర్వాత... పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : 47 ఏళ్ల తర్వాత మెదక్ జిల్లా కేంద్ర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు మేడ్చల్ జిల్లా కొంపల్లిలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సవాలతో జరుపుకొన్నారు. మెదక్ జిల్లాతో పాటు హైదరాబాద్, విదేశాల్లో స్థిరపడిన పలువురు తమ జీవిత భాగస్వాములతో దీర్ఘ కాల విరామం అనంతరం ఓ చోట చేరి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొన్నారు. 1977–79 ఇంటర్‌లో రెండేళ్లు పూర్తయి ఎవరికి వారు వేరే పలువురు వివిధ ప్రాంతాల్లో ఉన్నత విద్యలు, వ్యాపారాలు, ఉద్యోగాలు, వివాహాలు, సంతానాలు, పిల్లలు, వారి వివాహాల వంటి విషయాలతో మధుర స్మృతులు వేదికపై పంచుకొంటూ ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనంద డోళికలతో గడిపారు. ఇకపై తరచు సమ్మేళనాలు నిర్వహించుకొంటూ పరస్పర సహకారాలతో సామాజిక కార్యక్రమాలతో గడపాలని నిర్ణయించుకొన్నారు. పూర్వ విద్యార్థుల్లో మృతి చెందిన గోపాలకృష్ణ, వెంకటరెడ్డి, నర్సింగరావు, మురళీధరచారిలకు ఘనంగా నివాళులర్పించారు.



## రాహుల్ గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డికి స్పీకర్, మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య ఘన స్వాగతం

ప్రజాపక్షం/వికారాబాద్ : అనంతగిరిలో జరుగుతున్న డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరానికి విచ్చేసిన లోక్‌సభ ప్రతిపక్షనేత, కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కి హెలిప్యాడ్ వద్ద తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి ప్రసాద్‌కుమార్‌తో కలిసి వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య స్వాగతం పలికారు. ఈసందర్భంగా రాష్టంలో అతిచిన్న వయస్సులోనే మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన అనన్యను రాహుల్ గాంధీ అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, నాయకులు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి**




మోమిన్‌పేట్‌లోః తెలంగాణ రాష్ట్ర స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో మోమిన్‌పేట్ మండలంలోని కాస్లాబాద్ బిఆర్ఎస్ పార్టీ సర్పంచు సంద్ర మధుర మోహన్, ఉపసర్పంచు కుర్ర రామునాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శంకర్ యాదవ్, నరోత్తం రెడ్డి, ఎఎంసి చైర్మన్ మహేందర్‌రెడ్డి అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు . ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికోసం కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు.

## ఎసిబి దాడుల్లో పట్టుబడ్డ గణేష్



ప్రజాపక్షం/నిజాంపేటఃకుత్బుల్లాపూర్ ఎమ్మార్వో కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు 20,000/– లంచం డిమాండ్ చేసి పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్ జి. గణేష్ ను సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. గతంలో 5000/– అడ్వాన్స్‌గా తీసుకోగా పూర్తి మొత్తం డబ్బులు తీసుకుంటుండగా సిటీ రేంజ్1 అధికారులు పట్టుకున్నారు. తదనంతరం నాంపల్లి ఎసిబి ప్రత్యేక కోర్టులో హాజరు పరిచారు.



## ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా 30 ఫీట్ల జెండా ఆవిష్కరణ

ప్రజాపక్షం/నవాబుపేట్ : బిజెపి నవాబుపేట్ మండల బిజెపి మండల అధ్యక్షులు చంద్రకాంత్ అధ్యక్షతన మండల కేంద్రంలో బిజెపి 30 ఫీట్ల జెండాఎంపి కొండా విశ్వశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం ముఖ్య అతిథులుగా హాజరై మొదటగా ఎల్లకొండ జాతరలో భాగంగా శ్రీ పార్వతి పరమేశ్వర దర్శనం చేసుకొని అనంతరం ర్యాలీగా మండల కేంద్రానికి వచ్చి బిజెపి జెండాను ఎగరవేసి రాబోవు ఎన్నికలలో బిజెపి సత్తా చాటాలని, బిజెపి సిద్ధాంతాలతో పాటు రాజ్యాధికారం ప్రభుత్వస్థాపనకు ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ సెల్ కో కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్, జిల్లా నాయకులు జగన్, గాలయ్య, సర్పంచులు, ఉపాధ్యక్షులు, ఉపసర్పంచులు, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచులు,తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు బట్టలు పంపిణీ



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : మదనగిరి అనుష్ గౌడ్ తన పుట్టిన రోజు సందర్భంగా ఘట్‌కేసర్ సర్కిల్‌లో పనిచేస్తున్న 92 మంది కార్మికులకు జిహెచ్‌ఎంసి కార్యాలయం ఆవరణలో మదనగిరి అనుష్ గౌడ్ చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనుష్ గౌడ్ మాట్లాడుతూ నా పుట్టినరోజు కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్నందు కు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బండారి ఆంజనేయులు గౌడ్, కార్మికులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గొంతుకోసి మహిళ దారుణ హత్య!

ప్రజాపక్షం/నవాబుపేట్ : ఓ మహిళ దారుణ హత్యకు గురైన ఘటన నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ, పోలీసుల వివరాల ప్రకారం..నవాబ్ పేట్ మండలం ఎత్త్ రాజ్ పల్లి గ్రామానికి చెందిన మినేపల్లి బాలమణి (45) శంకర్ పల్లిలో కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తుంది. శనివారం అక్క యాదమ్మ, చెల్లి భారతమ్మ గుబ్బడి పత్తేపూర్‌కు వచ్చారు. నేను కూడ ఎల్లకొండకు వెళ్తానని కుమారుడు శేఖర్‌కి చెప్పి బాలమణి ఎల్లకొండ జాతర కోసం వెళ్లింది. దేవుడి దర్శనం అనంతరం రాత్రి హనుమాన్ దేవాలయం వద్ద జరుగుతు న్న భాగవతం చూస్తుండగా సుమా రు 4 గంటల బస్సు కు నేను శంకర్‌పల్లి పోతాను అని అక్కడనుండి వెళ్ళిపోయింది. కుమారుడు శేఖర్ ఉదయం ఫోన్‌చేస్తే స్విచ్ ఆఫ్ అని రావడంతో గ్రామానికి వచ్చి సిసి కెమెరాలు చూసి సర్పంచ్‌కి సమాచారం ఇచ్చి శంకర్ పల్లికి కుమారుడు వెళ్లిపోయాడని చెప్పారు. 2వ తేదీన అంజదా 11:45 నిమిషాలకు ఎల్లకొండ గ్రామం పులికుంట గుట్ట సమీపంలోని ఓ మహిళ మృతి చెంది ఉందని తెలుపగా వచ్చి చూడగా ప్రధాన రోడ్డు సమీపంలో హైదర్‌బాబు పొలంలోని వెంచర్‌లో బాలమణిని దుండగులు గొంతుకోసి దారుణ హత్యచేశారు. సమాచారం అందుకున్న సిఐ వెంకట్, ఎస్సై పుండ్లిక్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం సిబ్బం ది ఆధారాలు సేకరించారు. అమ్మను గొంతుకోసి ఆమె వద్ద ఉన్న 3తులాల బంగారం, 5 మసాలా కమ్మలు,18 తులాల పట్టగొలుసులు తీసుకెళ్లిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తగు న్యాయం చేయాలని కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలిస్తున్నామని మోమిన్ పేట్ సిఐ వెంకట్, నవాబుపేట్ ఎస్సై జీ. పుండ్లిక్ తెలిపారు.



## ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు

జిల్లా అదనపు న్యాయమూర్తి స్వాతిరెడ్డి




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు పాటిస్తూ ఆహారం తీసుకోవాలని జిల్లా ఆదనపు న్యాయమూర్తి ఎస్.స్వాతిరెడ్డి సూచించారు. సోమవారం షాద్‌నగర్ కోర్టు సముదాయంలో అపోలో ఆసుపత్రి, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా అదనపు న్యాయమూర్తి ఎస్.స్వాతి రెడ్డి, న్యాయమూర్తులు ఎం.సాహిత, ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్వాతిరెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధుల పట్ల న్యాయవాదులు జాగ్రత్తగా ఉంటూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. న్యాయవాదులకు వైద్య పరీక్షలు చేసేందుకు ఆపోల ఆసుపత్రి సిబ్బంది ముందుకు రావడం అభినందనీమన్నారు. కార్యక్రమంలో బార్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి గుండిబావి శ్రీనివాస్‌రెడ్డి, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మిట్టల్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సిమ్రాన్, డాక్టర్ కిరణ్‌బేడి, డాక్టర్ నిహారిక, కంటి వైద్యులు కృష్ణ, అమీన్, సాయికిరణ్, మార్కెటింగ్ విభాగం సైదులు, వంశీకృష్ణ, ల్యాబ్ సిబ్బందితోపాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి

మండల అభివృద్ధి అధికారి రాధరాణి



**ప్రజాపక్షం/యాచారం :** గ్రామ పంచాయతీలను అదర్శవంతంగా తీర్చిదిద్దడానికి వార్డు మెంబర్లు ప్రత్యేక చొరవ తీసుకోని భాగస్వాములు కావాలని మండల అభివృద్ధి అధికారి రాధ రాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేధికలో గ్రామ పంచాయతీ వార్డుమెంబర్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఎంపిడిఒ రాధరాణి మాట్లాడుతూ వార్డుమెంబర్లు పంచాయతీరాజ్ చట్టం గురించి అవగాహన పెంపొందించుకొవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూపరిండేంట్ శైలజా, ఇన్‌చార్జి ఎంపిఒ తిరుపతయ్య, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వార్డుమెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో నూతనంగా ఇంటి నిర్మాణం చేసుకుంటున్న కొమ్ము ఈశ్వర్‌కు గ్రామ మాజీ సర్పంచ్ డాక్టర్ వర్యా_త్వత్ రాజునాయక్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ జెనిగే శ్రీశైలం, ఐదో వార్డు సభ్యులు యంజాల విజేత చంద్రకాంత్, బిఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఒంగూరి రాజు, పంది నర్సింహ్మా, కందికంటి రాందాస్, మూలీ జంగయ్య, మూలి రాజు, పంది సురేశ్, మూలీ అనిల్, రాకేశ్ పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్, వార్డుసభ్యులకు శిక్షణ



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** శంకర్‌పల్లి మండలంలోని మోకిలా గ్రామ రైతు వేదికలో సోమవారం నుంచి శనివారం వరకు ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వెంకయ్యగౌడ్ తెలిపారు. మొదటిరోజు ఆదర్శ గ్రామాలు సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యుల విధులు, బాధ్యతలు, మిషన్ భగీరథ నీటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూర్త గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, ఎంపిఒ గిరిరాజ్, కోకిల గ్రామ సర్పంచ్ శేఖర్, పిఓటిలు చరణ్ తేజ, రామకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించేందుకు కృషి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్‌ను సోమవారం అందె మోహన్ కార్యాలయంలో సామాజిక కార్యకర్త నీల రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నీల రవీందర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో అత్యధిక మెజార్టీతో కౌన్సిలర్‌గా అందె మోహన్ విజయం సాధించడంతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం అభినంధనీయమన్నారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎల్కుర్తి నారాయణ, హన్మారి మురళీధర్, శ్యాంసుందర్, భక్తవత్సల్, నిరంజన్, మల్లేష్, అభిలాష్, వేణు, తేజ, ప్రదీప్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ డిగ్రీ, పిజి కళాశాలల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కరుణాకర్

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పాలమూరు యూనివర్సిటి పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ, పిజి కళాశాలల రాష్ట్ర కార్యవర్గంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, తెలంగాణ ఉద్యమకారుడు కరుణాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రైవేట్ డిగ్రీ, పిజి కశాలల నూతన రాష్ట్ర స్థాయి కార్యవర్గం ఏర్పాటు చేయడంతో అందులో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కరుణాకర్‌ను ఎన్నుకున్నారు.

## మద్యం దుకాణాల మూసివేత

**ప్రజాపక్షం /రంగారెడ్డి:** హోలీ పండుగ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలను మూసివేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం రమేష్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా మార్చి 3 ఉదయం 6:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని ఆయన తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# జిహెచ్‌ఎంసిలో 99 రోజుల 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'

ఫలితాలు వచ్చేలా అమలు చేయాలి

అధికారులకు ప్రత్యేక కమిషనర్ జయేష్ రంజన్ దిశానిర్దేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధియే లక్ష్యంగా జిహెచ్‌ఎంసి పరిధిలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని అత్యంత ప్రభావవంతంగా నిర్వహించాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జిహెచ్‌ఎంసి ప్రత్యేక అధికారి జయేష్ రంజన్ అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం జయేష్ రంజన్ అధ్యక్షతన మొట్టమొదటి కార్పొరేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత స్థాయిసంఘం ప్రతిపాదించిన 30 కీలక అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. ప్రతి అధికారి తమ పరిధిలో లక్ష్యాలను చేరుకోవాలని, పర్యవేక్షణలో ఏమరపాటు ఉండకూడదని జయేష్ రంజన్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ప్రియాంక అల, మందా మకరందు, ముకుంద రెడ్డి, చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



వారంవారం ఒక థీమ్..
క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ

- 14 వారాల పాటు సాగనున్న ఈ 99 రోజుల కార్యాచరణలో ప్రతి వారం ఒక ప్రత్యేక అంశంపై దృష్టి సారించనున్నారు.
- గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను పూర్తిగా తొలగించడం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి జరిమానాలు విధించడంపై దృష్టి సారించాలి.
- స్వయం సహాయక మహిళా పొదుపు సంఘాలు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల సహకారంతో చెరువులు, సరస్సుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలి.
- ఈవేస్ట్, టెక్స్టైల్ వేస్ట్‌ను సేకరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- యూత్ వీక్‌లో నైపుణ్యాభివృద్ధి, యాంటీడ్రగ్స్ చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి.
- విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, పర్యావరణం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ఉండాలని జయేష్ రంజన్ స్పష్టం చేశారు.
- యూత్ వీక్ సందర్భంగా యువతలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, యాంటీ డ్రగ్ చైత న్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.
- 99 రోజులపాటు జరిగే ఈ కార్యాచరణకు అంతర్గత ప్రణాళిక సిద్ధం చేసి ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

**కార్పొరేషన్ విభజన ప్రక్రియ...**రెండు రోజుల్లో 'సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్' ద్వారా జిహెచ్‌ఎంసి ఆస్తులు, అప్పులను మూడు కొత్త కార్పొరేషన్‌లకు పంపిణీ చేసే ప్రక్రియ పూర్తవుతుందని ఆయన తెలిపారు. సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్‌లకు తలా రూ. 500 కోట్ల బడ్జెట్ కేటాయింపులకు ఆమోదం లభించింది.

ఆమోదం పొందిన కీలక ప్రాజెక్టులు..

- సమావేశంలో ఆమోదం పొందిన 31 అంశాలపై అధికారులు చర్చించి, ఆమోదం తెలిపారు.
- ఓవైసీ జంక్షన్ ఫ్లైఓవర్ డౌన్ ర్యాంప్, రసూల్‌పురా జంక్షన్ వద్ద 4 లేన్ రోడ్డు, రెతిబౌలినానల్ నగర్ గ్రేడ్ సెపరేటర్ల కోసం ఆస్తుల సేకరణ.
- ఖిల్వత్‌లో మల్టీ లెవల్ పార్కింగ్, ఫలక్‌నుమా సమాంతర ఆర్‌ఓబి, ఫతేనగర్ ఫ్లైఓవర్ పునరుద్ధరణ పనులు.
- సనత్ నగర్, ఫతేనగర్, అఫ్జల్ సాగర్ ప్రాంతాల్లో సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రైన్, సీవరేజీ నెట్‌వర్క్ పనులకు అనుమతి.
- టౌన్ ప్లానింగ్ విభాగంలో 8 మంది డ్రాఫ్ట్‌మేన్‌లకు పదోన్నతులు.
- బేగంబజార్ ఫిష్ మార్కెట్‌లో గంగపుత్ర మత్స్యకారులకు మాత్రమే షాపుల కేటాయింపు, యాకుత్‌పురాలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఎన్‌ఓసి జారీ.

## హోలీ ప్రశాంతంగా జరుపుకోవాలి



నేడు సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు బంద్

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి.సజ్జనర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి. సజ్జనర్ సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసి నుంచి సోమవారం ఆయన పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పండుగ పూట ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బ్లూ కోట్స్, పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం గస్తీ కాయాలన్నారు. ఇష్టం లేని వారిపై బలవంతంగా రంగులు పూయొద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, పాదచారులు, వాహనాలపై రంగులు చల్లొద్దని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఆకతాయిల ఆటకట్టించేందుకు నగరవ్యాప్తంగా మఫ్టీలో షీ టీమ్స్ నిఘా ఉంటుందన్నారు. ప్రజలు రసాయన రంగులకు బదులు సహజసిద్ధమైనవి వాడాలన్నారు. వేడుకల్లో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని చెప్పారు. రోడ్లపై యువకులు గుంపులుగా తిరుగుతూ న్యూసెన్స్ చేస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ప్రస్తుతం రంజాన్ మాసం నేపథ్యంలో ముస్లింల ప్రార్థనలకు ఎలాంటి ఆటంకం కలగకుండా పీస్ కమిటీలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. హోలీ సందర్భంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, కల్లు కాంపౌండ్లు, బార్ అండ్ రెస్టారెంట్లపై ఆంక్షలు విధించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చెస్తామని స్పష్టం చేశారు. శాంతిభద్రతల సమస్య తలెత్తితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసులకు సహకరించి హోలీ సంతోషంగా జరుపుకోవాలని నగర ప్రజలను కోరారు. సమావేశంలో అదనపుసిపి తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపిలు శ్వేత, ఎస్‌ఎం. విజయ్ కుమార్, డిసిపిలు ఖారే కిరణ్ ప్రభాకర్, రూపేశ్, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

## పెండింగ్ అర్జీలకు సత్వరమే పరిష్కారం



హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ జితేందర్

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** పెండింగ్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ జి.జితేందర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వారి నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో హౌసింగ్ శాఖకు చెందిన 252 దరఖాస్తులు రాగా వాటిలో డబుల్ బెడ్ రూం ఇండ్లకు సంబంధించినవి 5, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి 247 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు చెందిన 18, రెవెన్యూశాఖకు సంబందించినవి 74 వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పిడి అశోక్ చక్రవర్తి, ఆర్డీఓ రామక్రిష్ణ, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పవన్‌కుమార్, సిపిఒ ఆర్.సురేందర్, సంక్షేమ శాఖాదికారులు ప్రవీణ్‌కుమార్, ఆశన్న, ఇలియాస్ అహ్మద్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య విలువలకు నిదర్శనం దుద్దిళ్ల శ్రీపాదరావు

సైబరాబాద్ సిపి డాక్టర్ రమేష్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్, దివంగత నేత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించారు. కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన శ్రీపాదరావు చిత్రపటానికి సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం.రమేష్ పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవలో శ్రీపాదరావు చూపిన నిబద్ధత, నిరాడంబరత నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఉమ్మడి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఆయన బాధ్యతలు నిర్వహించిన తీరు అద్వితీయమని కొనియాడారు. కార్యక్రమంలో అడ్మిన్ డిసిపి టి.అన్నపూర్ణ, క్రైమ్స్ డిసిపి ముత్యంరెడ్డి, ట్రాఫిక్ డిసిపి I రంజన్ రతన్ కుమార్, మాదాపూర్ ట్రాఫిక్ ఎడిసిపి హనుమంతరావు, వెల్ఫేర్ స్టార్స్ ఆర్ఐ అనిల్, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమకర్, అకౌంట్స్ విభాగం ప్రతినిధులు, మినిస్టీరియల్ స్టాఫ్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.



## ఖమేనీ మృతి పట్ల నిరసనలు



**ప్రజాపక్షం/చార్మినార్:** ఇరాన్ సుప్రీం ఖమేనీ మృతి పట్ల గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. దీంతో ఇరాన్ కాన్స్‌లేట్, అమెరికా కాన్సలేట్ కార్యాలయాలు ఉన్న ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ముస్లింలు వివిధ ప్రాంతాల్లో శాంతియుత నిరసనలు చేపట్టారు. పాతబస్తీతో పాటు న్యూసిటీలోనూ నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నిరసనల్లో ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ పాల్గొన్నారు.

## అసైన్డ్ మిగులు భూమి కాపాడాలని తహసీల్దార్ సురేందర్‌కు వినతి



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** శంకర్‌పల్లి మండలం మొకిలలోని మిగులు అసైన్ ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం శంకర్ పల్లి తహసీల్దార్ సురేందర్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి స్థలాలను ప్రజాప్రయోజనం కోసం వినియోగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అనిల్ కుమార్, ల్యాగాల నర్సిములు (ఎల్‌ఎన్‌ఆర్), కావలి సురేందర్, నయీమ్, శ్రీను, కిరణ్, లక్ష్మణ్, కరుణాకర్, డేనియల్, కుమార్, జావేద్, నారుద్దీన్, మాణిక్ ప్రభు, నర్సింలు, ఎన్.శ్రీను, లక్ష్మయ్య, అనంతయ్య, బడే సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో కౌన్సిలర్ కొప్పుఖరు ప్రవీణ్ అధ్యక్షతన సాయి బాలాజీ టౌన్‌షిప్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్‌లతోపాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ హాజరయ్యారు.

మున్సిపాలిటీలో ఇంటి పన్నులు తగ్గించేందుకు కృషి


**కొత్తూరు:** మున్సిపాలిటీలో పెరిగిన ఇంటి పన్నులను తగ్గించేందుకు కృషి చేయాలని కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ ఎమ్మెల్యేను కోరారు. సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ డోలీ రవీందర్, కౌన్సిలర్ వీరమోని హేమ దేవేందర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ జగన్, కాంగ్రెస్ నేత చిల్కమర్రి నరసింహులు, రవినాయక్, జగన్‌గౌడ్, మేకల రాజుయాదవ్, బండి శ్రావణ్, రాములు, చింత సాయి, అరవింద్ మిర్జా పాల్గొన్నారు.



# 40 ఏళ్ల పైబడిన మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** 40 సంవత్సరాల పైబడిన మహిళలు స్క్రీనింగ్ పరీక్షలకు హాజరయ్యే విధంగా సంబంధిత శాఖలు చొరవ తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టితో చేపట్టిన వందరోజుల ప్రత్యేక ఆరోగ్య సేవల కార్యక్రమాలు, జిల్లాలో వాటి అమలు, హెచ్‌పివి టీకా కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో కొంగరకలాన్ వద్ద మహిళా ఉద్యోగులకు మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు, స్క్రినింగ్ పరీక్షలతోపాటు అవసరమైన వైద్య సేవలు అందించబడతాయని తెలిపారు. జిల్లాలో 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం మొదటి దశలో మాతృ, శిశు ఆరోగ్యం, వృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టబడుతున్నామని చెప్పారు. గర్భిణీల పర్యవేక్షణ, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు, వృద్ధుల అవసరమైన వైద్య సేవలు సమగ్రంగా అందించేందుకు కార్యాచరణ రూపొందించబడిందన్నారు. నలభై సంవత్సరాలు పైబడిన మహిళలందరినీ వైద్య పరీక్షలకు హాజరయ్యే విధంగా మహిళా సంక్షే మం, మెప్మా శాఖల అధికారులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బాలికల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా హెచ్‌పివి టీకా కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 14 సంవత్సరాల పైబడిన బాలికలకు టీకాలు ఇప్పించేందుకు అవగాహన కల్పించాలన్నారు. వందరోజుల కార్యక్రమాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, అర్బన్ హెల్త్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితదేవి, జడ్‌పి సిఇఒ సిహెచ్ కృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




కలెక్టరేట్‌లో ఘనంగా మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ స్పీకర్‌గా శ్రీపాదరావు అందించిన సేవలను స్మరిస్తూ, శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

